సాక్షి
జగిత్యాల
బుధవారం । 22 । మార్చి । 2023



కవితా దినోత్సవం

గొల్లపల్లి: స్థానిక మోడల్ స్కూల్‌లో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం కవితా దినోత్సవం నిర్వహించారు.



మల్లన్న ఉత్సవాలు

మల్లాపూర్: యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీమల్లికార్జునస్వామి ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
32.0/20.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరుగుతుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కుజదోష నివారణ పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి యాగశాలలో మంగళవారం కుజదోష నివారణ పూజలు నిర్వహించారు. కుటుంబ కలహాలు, వాస్తుదోషాలు, ఆర్థిక ఇబ్బందులు తొలగిపోవడానికి ఈ పూజలు సత్ఫలితాలిస్తాయని అర్చకులు తెలిపారు. భక్తులు హాజరయ్యారు.

అర్చకులకు పురస్కారాలు

ధర్మపురి: పట్టణానికి చెందిన అర్చకులు చిలుకముక్కు రమణాచార్యులు, పాలెపు ప్రవీణ్‌శర్మ ఉగాది పురస్కారాలకు ఎంపికయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగే ఉగాది వేడుకల్లో వీరికి పురస్కారాలు అందజేస్తారు.

నూతన 'శోభ'

మెరిసిపోయే ప్రకృతి.. గొంతెత్తి పాడే కోయిల.. మావిచిగురు, వేపపూత పరిమళాలతో పరిసరాలన్నీ పరవశించే సమయం ఉగాది పర్వదినం. తిరిగిరాని కాలం తీసుకొచ్చే అనుభూతులు, అనుభవాలు మనుషుల జీవితాల్లో మధురమైన జ్ఞాపకాలుగా మారుతాయి. వేప పువ్వు, బెల్లం, చింతపండు, నెయ్యి, మిరియాలు, ఉప్పు మిశ్రమాలతో షడ్రుచుల సమ్మేళనం పచ్చడి. బుధవారం ఉమ్మడి జిల్లావాసులు శోభకృత్ నామ సంవత్సర ఉగాది పండుగ సంబరాలు జరుపుకోనున్నారు.




- అభివృద్ధి గెలిపిస్తుందని కారుపార్టీ ధీమా
- వ్యతిరేకత విజయాన్నిస్తుందని ప్రతిపక్షాల విశ్వాసం
- ఉగాది వేళ.. జాతకాల్లో అదృష్టం వెతుక్కుంటున్న నేతలు
- నూతన పంచాంగంలో కొత్త ఆశలతో ముందుకు..

రాజ్యపూజ్యమే లక్ష్యం!

విజయలక్ష్మి కటాక్షానికి అన్ని పార్టీల తహతహ

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: తెలుగు వారి కొత్త సంవత్సరాది ఉగాది. శోభకృత్ నామ సంవత్సరం సందర్భంగా ప్రతిఒక్కరూ తమ జాతకాన్ని కొత్త పంచాంగంలో వెతుక్కుంటున్నారు. ఈ ఉగాది సాధారణ ప్రజల కంటే.. రాజకీయ నాయకులకు ఎంతో కీలకమైంది. అధికారంలో ఉన్న ఎమ్మెల్యేలు, ప్రతిపక్షంలో ఉన్న ప్రత్యర్థులు, ఈసారి ఎన్నికల బరిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుందామనుకునే ఆశావహులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో అధికార –ప్రతిపక్ష నేతలంతా నూతన పంచాంగంలో తమ జాతకాలలో ఆదాయ వ్యయాల మాట ఎలా ఉన్నా.. రాజ్యపూజ్యంపైనే కన్నేశారు. అవమానాల మాట పక్కన బెట్టి.. రాజ్యపూజ్యం దక్కుతుందా? లేదా? అన్న అంశంపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తున్నారు. అన్ని నియోజకవర్గాల్లో రాజకీయ పరిస్థితిని ఒకసారి పరిశీలిస్తే..



సిరిసిల్ల: ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి కేటీఆర్‌కు ప్రత్యర్థులు పెద్దగా లేరు. కాంగ్రెస్ నుంచి కేకే మహేందర్‌రెడ్డి మినహా ఇక్కడ ఆయనకు గట్టి వైరిపక్షం కానరావడం లేదు. ఈసారి బీజేపీ మాత్రం సెలబ్రెటీని రంగంలోకి దించుతారన్న ప్రచారం సాగుతోంది.

వేములవాడ: ప్రస్తుత ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్(బీఆర్‌ఎస్)కు చిరకాల ప్రత్యర్థి ఈసారి కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ నుంచి గట్టి పోటీ ఎదురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీజేపీ నుంచి చెన్నమనేని విద్యాసాగర్ రావు కుమారుడు వికాస్ పేరు వినిపిస్తుండగా.. తాను స్వతంత్రంగానైనా పోటీచేస్తానని అదే పార్టీ నేత తుల ఉమ ఇప్పటికే ప్రకటించారు. ఎన్నారైలు గోలి మోహన్ (ఇప్పటికే నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు), మరో ఎన్నారై తోట రాంకుమార్ కూడా బరిలో నిలిచేందుకు ఆసక్తిగా ఉన్నారు.

జగిత్యాల: డాక్టర్ సంజయ్ ఇప్పటికే వరుసగా గ్రామాల్లో పర్యటిస్తూ.. పల్లె నిద్ర పేరుతో ప్రజలకు చేరవవుతున్నారు. ఇక మాజీ మంత్రి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి (కాంగ్రెస్) కూడా పోటాపోటీగా పర్యటనలు చేస్తున్నారు. ఇటీవల భోగశ్రావణి బీజేపీ నుంచి బరిలోకి దిగేందుకు ఆసక్తిగా ఉన్నారు.

కోరుట్ల: ప్రస్తుత ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు(బీఆర్‌ఎస్) వరుసగా అభివృద్ధి పనులు, శంకుస్థాపనలు అంటూ పర్యటిస్తున్నారు. ఈసారి జువ్వాడి నర్సింగరావు(కాంగ్రెస్) గట్టిపోటీ ఇచ్చేందుకు సంసిద్ధంగా ఉన్నారు. మార్పులు జరిగితే వీరిద్దరు కుమారులను బరిలో దింపుతారన్న ప్రచారమూ జరుగుతోంది.

ధర్మపురి: ఇక్కడ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్(బీఆర్‌ఎస్)కు ఈసారి గట్టిపోటీ ఉంది. ఇక్కడ నుంచి అడ్లూరి లక్ష్మణ్ (కాంగ్రెస్), మాజీ ఎంపీ గడ్డం వివేక్ (బీజేపీ) కూడా బరిలోకి దిగుతారని ప్రచారం సాగుతోంది.

పెద్దపల్లి: ప్రస్తుత ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి (బీఆర్‌ఎస్)కి సొంత పార్టీ నుంచే తీవ్ర పోటీ ఉంది. ఎమ్మెల్యే టికెట్ కోసం.. సొంత పార్టీకే చెందిన ఎన్నారై నల్ల మనోహర్‌రెడ్డి, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ నేత విజయరమణారావు నుంచి వీరికి గట్టి పోటీ ఎదురవనుంది. బీజేపీ నుంచి గుజ్జుల రామకృష్ణారెడ్డి, దుగ్యాల ప్రదీప్‌రావు, గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. బీఎస్పీ నుంచి దాసరి ఉష బరిలో ఉన్నారు.

మంథని: ప్రస్తుత ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు(కాంగ్రెస్)కు, పుట్ట మధు(బీఆర్‌ఎస్)కు ఈసారి హోరాహోరీ పోరు నడవనుంది. ఇక్కడ వీరిద్దరు మినహా మూడో పార్టీ అభ్యర్థులెవరూ ఇంతవరకూ ఆసక్తి చూపలేదు.

రామగుండం: ప్రస్తుత ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు, ఈసారి కాంగ్రెస్ నేత ఠాకూర్ మక్కాన్ సింగ్(కాంగ్రెస్) గట్టి పోటీ ఎదురవనుంది. వీరితోపాటు సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ(బీజేపీ) కూడా బరిలో ఉండటంతో పోరు రసవత్తరంగా మారనుంది.

కరీంనగర్: బీఆర్‌ఎస్ మంత్రి గంగుల కమలాకర్ తీగల వంతెన, ఎమ్మారెఫ్, స్మార్ట్ సిటీ పనులతో కరీంనగర్‌పై ఫోకస్ పెట్టారు. హిందుత్వం, మార్పు అన్న ఎజెండాతో భారతీయ జనతా పార్టీ(బీజేపీ) రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ నుంచి పోటీ ఎదరవనుంది. బీజేపీ నుంచి కొత్త జయపాల్‌రెడ్డి కూడా ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి ఎమ్మెస్సార్ మనవడు రోహిత్, నగరాధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. వైఎస్సార్‌టీపీ నుంచి డాక్టర్ నగేశ్ బరిలో నిలవనున్నారు.

చొప్పదండి: ప్రస్తుతం ఎమ్మెల్యే రవిశంకర్ (బీఆర్‌ఎస్)కు ఇంటిపోరు తప్పేలా లేదు. అదేపార్టీ నుంచి గజ్జెల కాంతం, కత్తెరపాక కొండయ్య, కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ టికెట్ రేసులో ఉన్నారు. ఈసారి మేడిపల్లి సత్యం (కాంగ్రెస్) నుంచి గట్టి పోటీ ఇవ్వనున్నారు. బీజేపీ నుంచి బొడిగె శోభ, సుద్దాల దేవయ్యల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. వైఎస్సార్‌టీపీ నుంచి అక్కెనపల్లి కుమార్ బరిలో నిలవనున్నారు.

మానకొండూరు: ఇక్కడనుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రసమయి బాలకిషన్‌కు ఈసారి ఇంటిపోరు తీవ్రంగానే ఉంది. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఇక్కడేనుంచే పోటీచేసిన ఓరుగంటి ఆనంద్ కూడా టికెట్ కోసం యత్నిస్తున్నారు. కాంగ్రెస్ నుంచి కవ్వంపల్లి సత్యనారాయణ, బీజేపీ గడ్డం నాగరాజు, దరువు ఎల్లన్న బరిలో నిలవనున్నారు.

హుజూరాబాద్: గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన ఈటల రాజేందర్ ప్రస్తుతం బీజేపీలో ఉన్నారు. బీఆర్‌ఎస్ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ఈసారి బరిలో దిగనున్నారు. కాంగ్రెస్ నుంచి ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

క్లుప్తంగా

పరీక్షలు ప్రశాంతంగా రాయాలి

జగిత్యాల: ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాయాలని అదనపు కలెక్టర్ లత సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాలను ఆమె పరిశీలించారు. విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దని, మంచిమార్కులు సాధించాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే కంట్రోల్‌రూమ్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కాగా, మంగళవారం 8,187 మంది విద్యార్థులకు 249 మంది గైర్హాజరయ్యారు. 95.95 శాతం మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ నారాయణ ఉన్నారు.

నరేశ్‌కుమార్‌కు ఉగాది పురస్కారం



నృత్యం చేస్తున్న చిన్నారులు

జగిత్యాల: జగిత్యాలకు చెందిన మేదిని లలిత కళాక్షేత్రం నాట్యసామ్రాట్ నరేశ్‌కుమార్‌కు మహతి ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభ వేదికలో ఉగాది పురస్కారం అందజేశారు. ఆయన వద్ద పలువురు నాట్యం నేర్చుకొని, ఉన్నత స్థానాలకు ఎదిగారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో నరేశ్‌కుమార్ ఆధ్వర్యంలో చిన్నారులు చేసిన నాట్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఆయన పురస్కారం అందుకోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

నియామకం

మెట్‌పల్లి(కోరుట్ల): ఖతర్‌లోని ఇండియన్ కమ్యూనిటీ బెనెవలెంట్ ఫోరమ్ మేనేజ్‌మెంట్ సభ్యుడిగా ఆత్మకూర్ గ్రామానికి చెందిన సుందరగిరి శంకర్ నియమితులయ్యారు. ఈ కమిటీలో భారత్‌లోని వివిధ రాష్ట్రాలకు చెందిన 11మందిని ఖతర్‌లోని భారత రాయబార కార్యాలయం నియమిస్తుంది. ఇందులో శంకర్‌కు చోటుకల్పించారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్న ఆయనకు కమిటీలో చోటు కల్పించడంపై జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నృసింహుని సన్నిధిలో ఐజీ



పూజలు చేస్తున్న ఐజీ తరుణ్ జోషి

ధర్మపురి: పోలీసు ఇన్‌స్పెక్టర జనరల్(ఐజీ) తరుణ్ జోషి మంగళవారం రాత్రి ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. తొలుత దేవస్థానం తరఫున ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ ఆలయాల్లోనూ ఐజీ పూజలు చేశారు. దేవస్థానం సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్.. ఐజీకి స్వామివారి శేషవస్త్రం కప్పి ప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎస్పీ భాస్కర్, డీఎస్పీ ప్రకాశ్, సీఐ కోటేశ్వర్, ఎస్సై కిరణ్‌కుమార్, వేదపండితులు బొజ్జ రమేశ్‌శర్మ, ముత్యాలశర్మ, ముఖ్య అర్చకుడు నంబి శ్రీనివాసచారి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పనులు ఎందుకు పూర్తి కాలేదు?

- గడువు ముగిసినా నిర్లక్ష్యమేనా?
- ఇంజినీరింగ్ అధికారులపై కలెక్టర్ మండిపాటు
- అసంపూర్తిగా 'మన ఊరు– మన బడి' పనులు



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

కథలాపూర్(వేములవాడ): 'మన ఊరు– మనబడి' పనులు అసంపూర్తిగా మిగిలిపోవడం, వాటిపైనే రంగులు వేయించడంపై కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత ఇంజినీరింగ్ అధికారుల తీరుపై మండిపడ్డారు. మంగళవారం సిరికొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 'మన ఊరు– మన బడి' పనులను ఆమె తనిఖీ చేశారు. గతంలో నిర్మించిన మరుగుదొడ్ల గదులకు పెయింటింగ్ వేయించడం, విద్యార్థుల సంఖ్యకు సరిపడేలా మరుగుదొడ్లు ఎందుకు నిర్మించలేదని ఇంజినీరింగ్ అధికారులు, ఉపాధ్యాయులను కలెక్టర్ మందలించారు. పాఠశాల ఆవరణలో రాళ్లు, సిమెంట్ వస్తువులు చిందరగా పడవేయడంతో విద్యార్థులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి రుచిగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. జెడ్పీ హైస్కూల్‌లోని ఓ తరగతి గదిని పరిశీలించి గోడలపై చెత్త ఉండటాన్ని చూసి ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పాఠశాలను సొంత ఇంటిగా భావించాలని, అప్పుడే పాఠశాలలు బలోపేతమవుతాయని అన్నారు. తరగతి గదులు అపరిశుభ్రంగా ఉండటంపై ఎంఈవోతోపాటు, హెచ్‌ఎంకు మెమో జారీ చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరోగ్య మహిళ, కంటి వెలుగు కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా కోరారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. భూషణరావుపేటలో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. రోజూ కనీసం 200 మందికి కంటి పరీక్షలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఏడురోజుల శిబిరంలో 1,250 మందికి కంటి పరీక్షలు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మకరంద్, ఆర్డీవో వినోద్‌కుమార్, జిల్లా వైద్యాధికారి శ్రీధర్, నీటిపారుదల శాఖ ఈఈ ప్రకాశ్‌రావు, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, ఎంపీపీ జవ్వాజి రేవతి, డీఎల్పీవో శంకర్, వైద్యశాఖ జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్ ఎండీ సమియొద్దీన్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో జనార్దన్, ఎంఈవో ఆనందరావు, వైద్యాధికారి సింధూజ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం వసూలు లక్ష్యం

జగిత్యాల: మున్సిపాలిటీల్లో వందశాతం ఆస్తిపన్ను వసూలు చేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశించారు. మంగళవారం సాయంత్రం మున్సిపల్ అధికారులతో తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రతీ మున్సిపాలిటీలో 100 శాతం పన్ను వసూలు చేయాలన్నారు. హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. సుందరీకరణ, అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ కమిషన్ బోనగిరి నరేశ్, డీఈ రాజేశ్వర్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి..

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. స్థానిక గాంధీనగర్ మహిళ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, మహిళల కోసం అందుబాటులోకి తీసుకొచ్చిన ఆరోగ్య కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. మహిళలకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఆమె వెంట అడిషనల్ కలెక్టర్ మకరంద్, డీఎం అండ్ హెచ్‌వో శ్రీధర్ పాల్గొన్నారు.

పకడ్బందీగా కంటి వెలుగు పరీక్షలు

కోరుట్ల: జిల్లాలో కంటి వెలుగు పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ యాసిమ్‌న్ బాషా అన్నారు. స్థానిక తొమ్మిదో వార్డులో చేపట్టిన కంటి వెలుగు శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. జిల్లాలో 261 కంటి వెలుగు శిబిరాలు పూర్తయ్యాయన్నారు. గ్రామాల్లో సర్పంచులు, పట్టణాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ల సాయంతో వీటిని విజయవంతగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 47,691 రీడింగ్ గ్లాసులు అందించామన్నారు. 62శాతం లక్ష్యం పూర్తయిందని వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మకరంద, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, కమిషనర్ ఎండీ ఆయాజ్, ఆర్డీవో నవీన్ కుమార్ పాల్గొన్నారు.

పేపర్ల లీకేజీకి కేటీఆర్ బాధ్యత వహించాలి

- తొమ్మిదేళ్లుగా పంట నష్టాన్ని పట్టించుకోని సీఎం కేసీఆర్
- ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

మల్యాల(చొప్పదండి): టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీకి మంత్రి కేటీఆర్ బాధ్యత వహించాలని, వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ ప్రభుత్వ కనుసన్నల్లో నడవకపోతే ఆ సంస్థ చైర్మన్‌తో ఎందుకు సమీక్ష చేశారని ప్రశ్నించారు. తొమ్మిదేళ్లుగా ప్రకృతి విపత్తుల కారణంగా పంటలకు నష్టం జరుగుతుంటే రైతులకు పరిహారం ఇవ్వడం లేదన్నారు. కనీసం సీఎం కేసీఆర్ స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్యాల మండలంలోని తక్కళ్లపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు మరాటి లక్ష్మీనారాయణ అనారోగ్యంతో బాధ పడుతుండగా మంగళవారం ఆయన ఇంటికి వెళ్లి, పరామర్శించారు. అనంతరం మల్యాల మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మంత్రి కేటీఆర్ మంచి జరిగితే తమ సమర్థత అని చెప్పుకుంటూ.. వైఫల్యం చెందితే మాత్రం నాకేం సంబంధం అనడం హాస్యాస్పదమని అన్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్ రెడ్డిని వెంటనే పదవి నుంచి తొలగించాలని, ప్రవీణ్, రాజశేఖర్‌ల తప్పిదాలకు మంత్రి కేటీఆర్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పేపర్ల లీకేజీ కారణంగా జాతీయ స్థాయిలో తెలంగాణ పరువు పోయిందన్నారు. గ్రూప్ 1 పరీక్ష క్వాలిఫై అయిన వారికి ఒక్కొక్కరికి రూ.లక్ష సాయం అందించాలని కోరారు. అతివష్టితో రోళ్లవాగు, అరగుండాల ప్రాజెక్టులు తెగిపోయి, కోట్లాది రూపాయల విలువైన మత్స్య సంపద కొట్టుకుపోయిందని తెలిపారు. వేలాది ఎకరాల్లో ఇసుక మేటలు వేసినా అన్నదాతలకు రూపాయి పరిహారం అందలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకరించడం లేదని రాష్ట్ర ప్రభుత్వం, నివేదికలు పంపడం లేదని కేంద్ర ప్రభుత్వం ఆరోపణలు చేసుకోవడం మినహా రైతులను ఆదుకున్న పాపాన పోవడం లేదని మండిపడ్డారు. మాజీ ఎంపీపీ దారం ఆదిరెడ్డి, నాయకులు దొంగ ఆనంద రెడ్డి, బోగ బక్కన్న, కంచర్ల లక్ష్మణాచారి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు శనిగరపు తిరుపతి, మారంపల్లి గంగాధర్, కో–ఆప్షన్ మాజీ సభ్యుడు ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టు అద్దె గదిలో భక్తురాలు మృతి

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయ మారుతి నిలయంలోని అద్దె గదిలో ఓ భక్తురాలు మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్ జిల్లా ధర్మారాజుపల్లికి చెందిన భక్తురాలు తన కుటుంబంతో కలిసి కొండగట్టుకు వచ్చింది. ఆలయంపై హారతి పట్టేందుకు మూడు రోజులుగా మారుతి నిలయంలోని 4వ నంబర్ గదిని అద్దెకు తీసుకొని, ఉంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం హారతి పట్టి, స్వామివారిని దర్శించుకొని, గదికి వెళ్లారు. అకస్మాత్తుగా సదరు భక్తురాలికి శ్వాస ఆడకపోవడంతో కుటుంబసభ్యులు కొండపై డాక్టర్ కోసం వెతికారు. కానీ కాసేపటికే ఆమె చనిపోయింది. హోంగార్డులు అక్కడికి చేరుకొని, ఆటోను పిలిపించి, వారిని స్వగ్రామం పంపించారు. అర్చకులకు సమాచారం అందించగా ఆలయాన్ని శుభ్రం చేసి, సంప్రోక్షణ అనంతరం దర్శనాలు ప్రారంభించారు. దాదాపుగా గంటసేపు భక్తురాలు ఇబ్బంది పడి మృతిచెందిందని భక్తులు తెలిపారు. కొండపై ప్రథమ చికిత్స కేంద్రం ఉన్నా అక్కడున్నవారు సమయానికి స్పందించలేదన్నారు. సకాలంలో ఆసుపత్రికి తరలిస్తే బతికేదని పేర్కొన్నారు.

రా మెటీరియల్ సరఫరా పేరిట మోసం

- రూ.4 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలంలోని తిప్పన్నపేటలో కొడిమ్యాల మండలానికి చెందిన సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, అతని భార్య వసంత పేరు మీద ఎస్వీ షీట్ ఇండస్ట్రీ ఏర్పాటు చేశారు. దానికి అవసరమైన రా మెటీరియల్ సరఫరా చేస్తామని మహారాష్ట్రకు చెందిన యూనివర్స్ మైన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ గతేడాది ఆగస్టు 3న వసంతకు రూ.9,20,400 కొటేషన్ వాట్సాప్ ద్వారా పంపించారు. దీంతో ఆ కంపెనీకి తిరుపతిరెడ్డి అడ్వాన్స్‌గా తన ఖాతా నుంచి రూ.4 లక్షలు పంపించారు. కానీ మెటీరియల్ రాకపోవడంతో పలుమార్లు ఫోన్లు చేశారు. స్పందన లేకపోవడంతో ఇది సైబర్ నేరగాళ్ల పనేనని, తాము మోసపోయామని గ్రహించి, మంగళవారం జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ పేర్కొన్నారు.

టెలిగ్రామ్ ప్రకటనతో యువకుడు..

ధర్మపురి: టెలిగ్రామ్‌లో వచ్చిన ప్రకటనను చూసి ఓ యువకుడు మోసపోయిన సంఘటన ధర్మపురిలో చోటుచేసుకుంది. సీఐ కోటేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మపురికి చెందిన అనిల్ బిట్ కాయిన్ ట్రేడింగ్ గ్రూప్‌లో డబ్బులు ఇన్వెస్ట్ చేస్తే రెట్టింపు అవుతాయని 2023 ఫిబ్రవరి 24న టెలిగ్రామ్ యాప్‌లో వచ్చిన ప్రకటన చూశాడు. అందులో ఉన్న నంబర్‌కు తన పేటీఎం నుంచి రూ.11,500 పంపించాడు. తర్వాత ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో మోసపోయానని తెలుసుకొని, మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చిన ప్రకటనలు చూసి, మోసపోవద్దన్నారు. ఆన్‌లైన్‌లో డబ్బులు పోగొట్టుకుంటే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

ఆన్‌లైన్ వ్యాపారం పేరిట..

మెట్‌పల్లి(కోరుట్ల): ఆన్‌లైన్ వ్యాపారం పేరిట మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఫేస్‌బుక్‌లో గుర్తు తెలియని వ్యక్తి ఇండియన్ డెయిరీ పాయింట్ పేరుతో తమతో ఆన్‌లైన్‌లో చేసే వ్యాపారంలో చాలా లాభాలుంటాయని ఒక ప్రకటన ఇచ్చాడు. దీన్ని చూసిన మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఓ వ్యాపారి ఫోన్‌లో అతనిని సంప్రదించాడు. పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయని ఆశ చూపడంతో దశలవారీగా ఫోన్ పే ద్వారా రూ.1,13,800 పంపాడు. ఆ తర్వాత కొన్ని రోజులకు వ్యాపారం గురించి అడిగితే అతని నుంచి స్పందన లేదు. దీంతో తాను మోసపోయాయని గ్రహించిన ఆ వ్యాపారి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుండెపోటుతో క్రీడాకారుడు మృతి



రాజవిష్ణు (ఫైల్)

మల్లాపూర్(కోరుట్ల): జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం గొర్రెపల్లి గ్రామానికి చెందిన క్రీడాకారుడు కొంపల్లి రాజవిష్ణు(34) క్రికెట్ ఆడుతూ గుండెపోటుతో కుప్పకూలి మృతి చెందాడు. ఈసంఘటన మల్లాపూర్‌లో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. గొర్రెపల్లికి చెందిన సరోజన – రాజం దంపతులకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరికి వివాహాలయ్యాయి. రాజం 15ఏళ్ల క్రితమే అనారోగ్యంతో మృతి చెందాడు. 2019 ఎన్నికల్లో కొంపల్లి సరోజన సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. చిన్నకుమారుడైన రాజవిష్ణు ఆమెకు చేదోడువాదోడుగా ఉంటున్నాడు. రాజవిష్ణుకి భార్య వాణి, కుమార్తెలు విశ్వాణి(10), వైష్ణవి(8), కుమారుడు శ్రీయాన్(4) ఉన్నారు. మల్లాపూర్‌లో చేపట్టిన ఎంపీఎల్ క్రికెట్ లీగ్‌లో క్రికెట్ ఆడుతుండగానే గుండెపోటుకు గురై కుప్పకూలాడు. సహచర ఆటగాళ్లు సీపీఆర్ చేసి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు తదితరులు సంతాపం ప్రకటించారు.

భవన నిర్మాణాల ప్రకారం పన్ను విధింపు

ధర్మపురి: పురాతన ఇళ్ల స్థానంలో కొత్తగా నిర్మించుకున్న భవన నిర్మాణాల ప్రకారం పన్ను విధింపు ఉంటుందని ధర్మపురి మున్సిపల్ కమిషనర్ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. మేజర్ పంచాయతీగా ఉన్న సమయంలో ఇంటి పన్నులకు మున్సిపాలిటీగా మారిన తర్వాత పన్నులకు తేడా ఉంటుందన్నారు. సందేహాలుంటే నేరుగా మున్సిపల్ కార్యాలయానికి వచ్చి, తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు లేఖ నంబర్ 414849/2022–యంఐ తేదీ 20–05–2022 నుంచి ట్యాక్స్ రేట్ నివాస భవనాలకు 1–00 నుంచి 0.25కు, నివాసేతర భవనాలకు 0.40కు తగ్గించినట్లు తెలిపారు. వీటిని అనుసరించి పట్టణంలోని భవనాలకు ఇంటి పన్ను విధిస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ చౌర్యం కేసులో జరిమానా

జగిత్యాల జోన్/ఇబ్రహీంపట్నం(కోరుట్ల): విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి రూ.13,544 జరిమానా విధిస్తూ జగిత్యాల మొదటి అదనపు జిల్లా జడ్జి వీరయ్య మంగళవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించలేని పరిస్థితుల్లో రెండు నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కరీంనగర్ ట్రాన్స్‌కో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.స్వామి వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలంలోని యామాపూర్‌కు చెందిన పల్లెమీది మహేందర్ జూన్ 26, 2019న విద్యుత్ చౌర్యానికి పాల్పడగా సంబంధిత అధికారులు పట్టుకొని, ట్రాన్స్‌కో విజిలెన్స్ పోలీసులకు అప్పగించారు. వారు మొదటి తప్పుగా భావించి, రూ.1,000 జరిమానా విధించారు. జరిమానా చెల్లించి, మరోసారి విద్యుత్ చౌర్యానికి పాల్పడనని హామీ ఇచ్చిన మహేందర్ ఆగస్టు 20, 2019న విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డాడు. విద్యుత్ శాఖ అధికారులు పట్టుకొని, విజిలెన్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు నిందితుడిపై కేసు నమోదు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టగా పరిశీలించిన న్యాయమూర్తి మహేందర్‌కు జరిమానా విధించారు. సాక్ష్యాలను కోర్టుకు సమర్పించిన ఎస్సైలు ఎ.నిరంజన్ రెడ్డి, టి.నవేష్, కానిస్టేబుళ్లు ఇంతియాజ్, మల్లారెడ్డిలను విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

మానవ అక్రమ రవాణా నేరం

జగిత్యాల: మానవ అక్రమ రవాణా అతిపెద్ద నేరమని సీడీపీవో వీరలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక క్రీడా కార్యాలయంలో అంగన్‌వాడీ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. మానవ అక్రమ రవాణా ప్రపంచంలోనే మూడో అతిపెద్ద నేరంగా పరిగణిస్తున్నారన్నారు. అంగన్‌వాడీ టీచర్లు తమ పరిధిలోని అన్నివర్గాల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై అవగాహన పెంచుకుని అందరినీ అప్రమత్తం చేయాలన్నారు. ప్రాజెక్ట్ మేనేజర్ బలరాంకృష్ణ మాట్లాడుతూ, ప్రజ్వల సంస్థ 27ఏళ్లుగా డాక్టర్ సునీత కృష్ణ ఆధ్వర్యంలో ఐసీడీఎస్, పోలీస్, జ్యుడీషియల్ సహకారంతో 26,500 మంది అమ్మాయిలను కాపాడి, పునరావాసం కల్పించిందన్నారు. యువత ఇంటర్నెట్, మొబైల్ ద్వారా సైబర్ ట్రాకింగ్‌కు గురవుతోందని, ఈవిషయంపైనా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కో ఆర్డినేటర్లు శ్రావ్య, శృతి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

కోరుట్లటౌన్: స్వేచ్ఛ సాహిత్య, సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనం కోరుట్ల పట్టణంలోని సి.ప్రభాకర్ గ్రంథాలయ ఆవరణలో సోమవారం రాత్రి జరిగింది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రాస భూమయ్య, కవి వోటారి చిన్న రాజన్న అధ్యక్షతన 40 మంది కవులు ఉగాది కవితలు, పాటలతో ఆకట్టుకున్నారు. ప్రతీ వ్యక్తిలో దాగివున్న ప్రతిభను వెలికితీసి కవులు, రచయితలుగా ప్రోత్సాహం అందిస్తున్న స్వేచ్ఛ సంస్థ పనితీరు అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో కవులు చెన్న విశ్వనాథం, రావికంటి పవన్, కట్కం కవిత, సుతారి గంగమణి, వోటారి రమాదేవి, కటుకోజ్వల మనోహరాచారి, నేరెళ్ల రామకృష్ణ శాస్త్రి, రుద్ర మాణిక్యం, రుద్ర నాగరాజు, గోలి దిలీప్, పోతుగంటి వెంకటేశ్వర్లు, రాజోజి భూమేశ్వర్, రాపెల్లి రాజగంగారాం, రాజబత్తుల రాజశేఖర్, వోటారి శ్రీనివాస్, భూపెల్లి నాగేశ్వర్‌రావు, నాంతాబాద్ రవి, ఆర్మూర్ శ్యాం, లింబాద్రి, చిలుక రాజలింగం, ఆడెపు శిరీష్, ఆదామ్, రూప్‌సింగ్, బి.భూమేశ్, కల్యాణచారి, గ్రంథాలయ సభ్యులు, పాఠకులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్ చోరీ

కోరుట్ల: పట్టణ శివారులోని కల్లూర్ రోడ్డులో గల బెల్లాల చిన్న భూమయ్య, వెల్ముల పెద్ద నర్సయ్య మామిడి తోటల్లో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టారు. అందులోని కాపర్ వైర్ ఎత్తుకెళ్లారు. విద్యుత్ శాఖ ఏఈ సలువాది శ్యామ్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

ధర్మపురి: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం, నర్సయ్యపల్లె గ్రామంలో సర్పంచ్ నేరెల్ల లావణ్య ఆధ్వర్యంలో మంగళవారం కంటి వెలుగు శిబిరాలు నిర్వహించారు. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. పేదల కోసం ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం చేపట్టిందన్నారు. కంటి సంబంధిత ఏ సమస్య ఉన్నా వైద్యులు గుర్తించి కళ్లద్దాలు అందిస్తారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలసాహిత్యంతోనే పఠన నైపుణ్యం



హాజరైన ఉపాధ్యాయులు

జగిత్యాల: బాలసాహిత్యంతోనే పఠన నైపుణ్యం పెంపొందుతుందని సెక్టోరియల్ అధికారి కొక్కుల రాజేశ్ అన్నారు. ఎంపిక చేసిన 78 పాఠశాలల ఉపాధ్యాయులకు గ్రంథాలయ పుస్తకాల నిర్వహణ, ఆవశ్యకతలపై మంగళవారం జిల్లా కేంద్రంలో శిక్షణ ఇచ్చారు. రాజేశ్ మాట్లాడుతూ, పిల్లల్లో భాషాభివృద్ధికి, పఠనాసక్తి పెంపొందించేందుకు పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. బాలసాహిత్యంలో పాఠశాలల్లో అందుబాటులో ఉండేలా 259 పుస్తకాల చొప్పున జిల్లాలోని 153 పాఠశాలల్లో గ్రంథాలయ పుస్తకాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రైనర్లు మహేశ్, అభయ్‌రాజ్ పాల్గొన్నారు.